## క్లుప్తంగా

### 16న జాబ్ మేళా

గాజువాక: ఐసీఐసీఐ బ్యాంక్‌లో వివిధ కేటగిరీల్లో ఉద్యోగాల భర్తీ కోసం స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. రిలేషన్‌షిప్ మేనేజర్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్, వర్చువల్ రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులను ఆన్‌రోల్‌లో భర్తీ చేసేందుకు ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. డిగ్రీ పూర్తి చేసిన 25 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందని, వార్షిక వేతనం రూ.2.2లక్షల నుంచి రూ.2.5లక్షల వరకు ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలు కళాశాల ప్రాంగణంలో ఉదయం పది గంటలకు ప్రారంభమవుతాయని, అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, దరఖాస్తులతో ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావచ్చని పేర్కొన్నారు. వివరాల కోసం 91820 20936 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.


### చందుకు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రతినిధుల మద్దతు



ఉరుకూటి చందుతో లీగల్ సెల్ నాయకులు

గాజువాక: వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందుకు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రతినిధులు మద్దతు తెలిపారు. లీగల్ సెల్ అధ్యక్షుడు ఎంజీడీ డబ్ల్యూ డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయన్ను కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. చందును కలిసిన వారిలో లీగల్ సెల్ నాయకులు గిల్బర్ట్, ఒ.రత్నరాజు, కె.వెంకట రమణ, మాధవి, ఎస్.రాజేష్, బి.టి.వి.ప్రసాద్ తదితరులున్నారు.

### నూతన నియామకం



భూపతిరాజు శ్రీనివాసరాజు

పెదగంట్యాడ: పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డివిజన్ (పీటీడీ) వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షునిగా భూపతిరాజు శ్రీనివాసరాజు నియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య నియామక పత్రాన్ని అందజేశారు. భూపతిరాజు నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

### 15న పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఈ నెల 15న అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు విశాఖపట్నం ఎంఎస్‌ఎంఈ డీఎఫ్‌ఓ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత గాజువాకలోని శ్రీ కృష్ణ యాదవ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ స్కీమ్ ద్వారా చేతివృత్తులపై జీవనం సాగిస్తున్న వారికి శిక్షణ ఇచ్చి, శిక్షణ అనంతరం పూచీకత్తు లేకుండా రూ.1లక్ష రుణం ఇస్తారని తెలియజేశారు. వివరాలకు ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.శ్రీనును 96505 19787 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### రాంనగర్‌లో లేపాక్షి ఎంపోరియం ప్రారంభం

డాబాగార్డెన్స్: రాంనగర్‌లో లేపాక్షి ఎంపోరియం రెండో షోరూం, ఆప్కో మంగళవారం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అఖిల భారత వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి కొత్త స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో విశాఖపట్నంలో లేపాక్షి రెండో షోరూం ప్రారంభించామన్నారు. ఎంపోరియం ఏర్పాటుకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున కృషి చేశారన్నారు. విశాఖ వాసులు లేపాక్షి ఎంపోరియంలో చేతి వృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులు, చీరలు, వస్త్రాలు కొనుగోలు చేసి, హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రతీ జిల్లా ప్రధాన కేంద్రంలో వైఎస్సార్ చేతివృత్తుల బజార్ల ఏర్పాటుకు సంబంధించిన ఫైల్ ముఖ్యమంత్రికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో లేపాక్షి మేనేజర్ కార్తీక్, ఆప్కో సిబ్బంది పాల్గొన్నారు.




# మహిళా 'నేస్తం'

- అగ్రవర్ణ కులాల మహిళలకు అండగా 'ఈబీసీ నేస్తం', 'కాపు నేస్తం'
- తమను గుర్తించింది సీఎం జగనే అంటూ లబ్ధిదారుల హర్షం

మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ వారికి అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తోంది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా వారికి ఆర్థిక భరోసాను కల్పిస్తూ మహిళా నేస్తంగా నిలిచింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని మహిళల కోసం అమలు చేస్తున్న కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాలు వారికి ఎంతో అండగా నిలుస్తున్నాయి.



గాజువాక: నవరత్నాలు–సంక్షేమ పథకాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కాపునేస్తం, ఈబీసీ నేస్తం పేరుతో మహిళలకు ఆర్థిక సహకారం అందిస్తోంది. కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల మహిళల సంక్షేమం కోసం కాపు నేస్తం పథకాన్ని, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల మహిళలకు ఈబీసీ నేస్తం పేరుతో ఆర్థిక సహకారం అందిస్తోంది. ఏడాదికి రూ. 15వేల చొప్పున ఐదేళ్లలో రూ.75వేలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది.

**ఈబీసీ మహిళలకు అండగా..**

ఆర్థికంగా వెనుకబడిన తరగతుల మహిళలకు సైతం అండగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న మరో పథకం ఈబీసీ నేస్తం. ఈ పథకం ద్వారా కూడా 45 నుంచి 60 ఏళ్ల లోపు ఉన్న మహిళలకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం వారి ఖాతాల్లో నగదును జమ చేస్తోంది.

ఈ పథకం కింద రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియతోపాటు మిగిలిన ఓసీ సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు ఈ పథకం అమలవుతోంది. ఈ పథకం ద్వారా గాజువాక నియోజకవర్గంలో రూ.6.98 కోట్లను ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది.

### కాపు మహిళల జీవన ప్రమాణాలు పెంచేందుకు..

రాష్ట్రంలోని కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన మహిళల జీవన ప్రమాణాలను పెంచడం లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన ప్రతిష్టాత్మక పథకం వైఎస్సార్ కాపు నేస్తం. కాపు మహిళల జీవనోపాధి అవకాశాలు, జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా నిర్దేశిత కులాల్లోని 45 నుంచి 60 ఏళ్ల వయస్సున్న మహిళలకు ఏడాదికి రూ.15వేల ఆర్థిక సాయం అందజేస్తారు. ఈ పథకం ద్వారా ఒక్క గాజువాక నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.11.63 లక్షల నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ముఖ్యమంత్రి బటన్ నొక్కి జమ చేశారు.

### వైఎస్సార్ కాపు నేస్తం లబ్ధిదారులు

| సంవత్సరం | లబ్ధిదారులు | నగదు పంపిణీ |
|---|---|---|
| 2019-20 | 611 | 87,67,000 |
| 2020-21 | 3522 | 5,28,30,000 |
| 2021-22 | 1776 | 2,66,40,000 |
| 2022-23 | 1804 | 2,81,54,500 |
| నాలుగు విడతల్లో లబ్ధిదారులకు అందజేసిన నగదు | | 11,63,91,500 |

### ఈబీసీ నేస్తం లబ్ధిదారులు

| సంవత్సరం | లబ్ధిదారులు | నగదు పంపిణీ |
|---|---|---|
| 2019-20 | 260 | 39,70,000 |
| 2020-21 | 1104 | 1,55,40,000 |
| 2021-22 | 1527 | 2,29,05,000 |
| 2022-23 | 1851 | 2,74,30,000 |
| నాలుగు విడతల్లో లబ్ధిదారులకు అందజేసిన నగదు | | 6,98,45,000 |

#### మాకు ఎంతో అండ



వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా సీఎం జగన్‌మోహన్ రెడ్డి మాలాంటి ఎందరికో ఆర్థిక సహకారం అందించారు. మూడేళ్లుగా ఏడాదికి 15వేలు చొప్పున మొత్తం 45 వేల రూపాయలను నేరుగా నా బ్యాంకు ఖాతాకే జమ చేశారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో కాపులకు ఎటువంటి పథకాలను అమలు చేయలేదు. ఉద్యోగ, ఉపాధి హామీలను విస్మరించి, చంద్రబాబునాయుడు కాపులు ఆర్థికంగా వెనుకబడేలా చేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి మా పిల్లల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడంతో పాటు మాకు ఎంతో అండగా ఉంటున్నారు. –**బొడ్డు తిరుమల**, కణితి కాలనీ

#### పాల వ్యాపారం చేస్తున్నాను



నా భర్త మరణించడంతో రోజులు గడవడం కష్టంగా ఉండేది. కూలి పనులు చేయడానికి శక్తి లేదు, అలవాటు లేదు. ఆ సమయంలో ముఖ్యమంత్రి జగన్ కాపు నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.15వేలు వంతున మూడేళ్లకు రూ.45వేలు నా బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. ఆయన దయ వల్ల గేదెను కొనుక్కుని ఇంటి పక్కల వాళ్లకు పాలు పోసుకుంటూ కుటుంబ పోషణ చేసుకుంటున్నాను. మా అమ్మాయి అమ్మ ఒడి పథకం ద్వారా అందిస్తున్న డబ్బులతో చదువుకుంటుంది. ముఖ్యమంత్రి జగన్‌కు మేం ఎప్పటికీ రుణ పడి ఉంటాం. – **బలిరెడ్డి శివానంద లక్ష్మి**, కొండయ్యవలస

#### మా గురించి ఎవరూ ఇంత ఆలోచించలేదు



నేను అగ్రవర్ణంలో పుట్టినా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాను. ఈ వయసులో నేను పనికి వెళ్లలేని పరిస్థితి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మాలాంటి వాళ్ల గురించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈబీసీ నేస్తం పథకాన్ని అమలు చేస్తున్నారు. వయసులో చిన్నవాడైనా పెద్దవాళ్ల గురించి, అగ్రవర్ణాల పేదల గురించి మంచి ఆలోచన చేశారు. ప్రతి ఏటా నాకు రూ.15వేలు అందిస్తున్నారు. ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులు తప్పాయి. ఇంతకు ముందెవరూ మా కోసం ఆలోచించలేదు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

– **పుట్ట రమణమ్మ**, బాబు జగ్జీవన్‌రామ్ కాలనీ

#### వ్యాపారం చేసుకుంటున్నా..



అగ్ర వర్ణ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీల సంక్షేమం కోసం పథకాలను అమలు చేస్తుంటాయి.. జగన్‌బాబు ప్రభుత్వం మాత్రం అన్ని వర్గాల గురించి ఆలోచిస్తున్నారు. అందులోనూ అగ్రవర్ణాల్లోని పేదల కోసం ఈ పథకాన్ని అమలు చేయడం సంతోషించదగ్గ విషయం. ఏడాదికి రూ.15వేలు ఇస్తున్నారు. ఆ డబ్బులతో వ్యాపారం చేసుకుంటున్నాను. చిన్న చిన్న ఆర్డర్లు తీసుకుని ఇంటి వద్దే వంటలు తయారు చేసి అందిస్తున్నాను.ఆర్థిక ఇబ్బందులు తొలగి చాలా సంతోషంగా ఉంది.

– **శ్రీధరాల లలిత**, నడుపూరు, 76వ వార్డు

## మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి

- సీఎం జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలి
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: రానున్న ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సైనికుల్లా పని చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బీసీ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చెప్పినట్లు 175కు 175 స్థానాలు సాధించడంలో భాగంగా గాజువాకలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలన్నారు. ఇందుకు ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని కోరారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పాటు పడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పారదర్శక పాలన అందిస్తున్నారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. దళారుల బెడద లేకుండా సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో పాటు ప్రతీ 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి, నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత మన సీఎంకే దక్కుతుందన్నారు. 2019 ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని, వారి ఆర్థికాభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు.

**ఓర్వలేకనే విమర్శలు**

ప్రభుత్వ పాలన చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉందని, పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు పని చేయాలని, గాజువాకలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేసేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, నాయకులు మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, ధర్మాల శ్రీను, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, ఇల్లపు ప్రసాద్, గొందేశి మహేశ్వరరెడ్డి, బ్రహ్మయ్య, సన్నీ, రోజారాణి, దొడ్డి రమణ, సిరట్ల శ్రీనివాస్, బొడ్డ గోవింద్, మంత్రి శంకరనారాయణ, గొందేశి వెంకటరమణారెడ్డి, వెంపాడ అప్పారావు, చిత్రాడ వెంకటరమణ, వెంకటేష్, ఎన్నేటి రమణ, కొయ్య భారతి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్కంఠగా ప్లాంట్ లెవెల్ మాక్ డ్రిల్



స్టీల్‌ప్లాంట్ మాక్ డ్రిల్‌లో సీఐఎస్‌ఎఫ్ ఫైర్ సిబ్బంది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం నిర్వహించిన ప్లాంట్ లెవెల్ మాక్ డ్రిల్ ఉత్కంఠగా జరిగింది. ఆన్‌సైట్ ఎమర్జెన్సీ ప్రిపరేషన్‌ని నిర్ధారించడంలో భాగంగా రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (డీసీఎఫ్ఐ) వి.సురేష్, పి.చిన్నారావు మార్గదర్శకత్వంలో, వారి సమక్షంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉదయం గ్యాస్ రికవరీ ప్లాంట్–2 యొక్క స్ట్రీమ్–2లో ఫాబ్రిక్ కాంపెన్సేటర్ నుంచి ఎల్‌డీ గ్యాస్ లీక్ అయినట్టు సమాచారం వచ్చింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఫిక్స్‌డ్, మొబైల్ ఫైర్ ఫైటింగ్ ఇన్‌స్టలేషన్లు, వాటర్ కర్టెన్ సిస్టంలు, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ పరికరాలతో ఎనర్జీ మేనేజ్‌మెంట్ విభాగం ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ ఫైర్ వింగ్ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ప్రమాదంలోని బాధిత వ్యక్తులను సంఘటనా స్థలం నుంచి రక్షించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (సర్వీసెస్) ప్రవీణ్ కుమార్‌తో పాటు ఆయా విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా రేడియో దినోత్సవం



రేడియో రిసీవింగ్ స్టేషన్ ఏడీ రామచంద్రారెడ్డిని సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: ప్రపంచ రేడియో దినోత్సవాన్ని అగనంపూడిలోని ఆలిండియా రేడియో రిసీవింగ్ స్టేషన్ ఆవరణలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా రేడియో స్టేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 1946 ఫిబ్రవరి 13వ తేదీ నుంచి ఐక్యరాజ్య సమితి సూచనల మేరకు ప్రపంచ రేడియో దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. భారతదేశంలో మొత్తం 420 రేడియో స్టేషన్ల ద్వారా 23 భాషల్లో ప్రసారాలు సాగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డిని, అసిస్టెంట్ ఇంజినీర్ వి.గోవిందరావులను అగనంపూడికి చెందిన ప్రజా సంఘాలు ఘనంగా సత్కరించాయి. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మోటూరి వెంకటరమణ, బలిరెడ్డి సత్యనారాయణ, అంగులూరి ఈశ్వరరావు, కోసూరి తాతారావు, విందుల వరహాలు, యశోదకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## రేపు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

విశాఖ విద్య: జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ఈ నెల 15న నిర్వహించనున్నట్టు జిల్లా సైన్సు అధికారి కె. ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గాజువాక కణితి రోడ్‌లోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వేదికగా నిర్వహిస్తున్న ప్రదర్శనకు జిల్లాలో 65 ప్రాజెక్టులు ఎంపికైనట్టు పేర్కొన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులతో విద్యార్థులు, సైన్సు ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయిలో ఉత్తమంగా నిలిచిన ఏడు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

## అవార్డు గ్రహీతలకు సన్మానం



వైద్యులు భారతి, ఉష, కృష్ణమూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మిని సత్కరిస్తున్న నాయకులు

అగనంపూడి: అగనంపూడి పరిసర ప్రాంతీయులకు మెరుగైన సేవలు అందించడంలో ఆస్పత్రి సిబ్బంది కృషి అభినందనీయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్ అన్నారు. ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న అగనంపూడి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, ఆర్ఎంవో డాక్టర్ ఉష, ఆర్థోపెడిక్ డాక్టర్ కృష్ణమూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మిలను 85వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నక్కా రమణబాబు, 85వ వార్డు యూత్ అధ్యక్షుడు పెదిరెడ్ల హరీష్, నాయకులు కరణం శ్రీనివాసరావు, కొలిమల్ల హరేరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'కేవీ మూసివేత చర్యలు ఉపసంహరించుకోవాలి'

ఉక్కునగరం: కేంద్రీయ విద్యాలయం (కేవీ) మూసివేత దిశగా యాజమాన్యం, ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఉపసంహరించుకోవాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ సీఎండీకి మంగళవారం వారు లేఖలు అందజేశారు. కేవీలో సీఐఎస్ఎఫ్ సిబ్బందితో పాటు పేద, బడుగు వర్గాల పిల్లలకు మంచి విద్య అందుతోందన్నారు. యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమ చర్యలు ఒక్కొక్కటి నిలిపివేయడంలో భాగంగా మొన్న జనరల్ ఆస్పత్రి, నేడు స్కూళ్లపై దాడి చేస్తోందని ఆరోపించారు. యాజమాన్యం తన బాధ్యత నుంచి నెమ్మదిగా తప్పుకుని ఆ భారాన్ని విద్యార్థులపై రుద్దుతోందన్నారు. కనీస బాధ్యత మరిచి అరుణోదయ పాఠశాల నిర్వహణకు ఉద్యోగుల నుంచే నిధులు సమీకరిస్తున్నారన్నారు. ఇదేనా ఈ ప్రభుత్వ 'బేటీ పడావో – బేటీ బచావో' అంటే.. అని ఎద్దేవా చేశారు. యాజమాన్యం తక్షణమే కేవీపై చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

## 'కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి'



మాట్లాడుతున్న కార్మిక నాయకులు

ఉక్కునగరం: దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు, ప్రజల సమస్యల పరిష్కారానికి ఈ నెల 16న నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని ఉక్కు కార్మిక నాయకులు కోరారు. మంగళవారం అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాల్లో సమ్మె విజయవంతానికి ప్రచారం చేశారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ ఆపాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని,రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, అధిక ధరలు తగ్గించాలన్న డిమాండ్లపై దేశవ్యాప్తంగా జరుగుతున్న బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. అఖిలపక్ష కార్మిక నాయకులు వై.మస్తానప్ప, వై.టి.దాస్, జి.నరేష్‌కుమార్, జి.వి.సుబ్బయ్య, డి.సురేష్ బాబు, డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## 'ఉక్కు' ప్రైవేటీకరణకు స్వస్తి పలికే వరకు ఉద్యమం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకునే వరకు కార్మికులు చేస్తున్న ఉద్యమాలు ఆగవని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. అప్పటి వరకు నిరసనలు కొనసాగిస్తూనే ఉంటామన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1097వ రోజు, మంగళవారం సంస్థకు చెందిన పలువురు కార్మికులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కార్మిక వర్గం ఎంతగానో శ్రమించారన్నారు. ఇలాంటి పరిశ్రమను అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంట్‌ను నష్టాల ఊబిలోకి నెట్టే ప్రయత్నం చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. నాయకులు ఇప్పటికైనా స్పందించి, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆపాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## అప్పికొండ ఆలయానికి తిరుపతి నుంచి విగ్రహాలు



ఆలయానికి తీసుకువస్తున్న విగ్రహాలు

పెదగంట్యాడ: అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్టించేందుకు తిరుపతిలో ప్రత్యేకంగా నవగ్రహ, సీతారామ లక్ష్మణ హనుమాన్ విగ్రహాలు తయారు చేయించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అప్పికొండ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు నందూరు అలివేలు మంగతాయారు కృషితో, తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో కమిటీ వీటిని తయారు చేయించినట్లు చెప్పారు. సోమేశ్వర స్వామి ఆలయం స్వయంగా వెలసినది కావడం, అక్కడ నవగ్రహ విగ్రహాలు లేకపోవడం కొంత లోటుగా భావించి, వాటితో పాటు సీతారామలక్ష్మణ హనుమాన్ విగ్రహాలను తిరుపతిలో తయారు చేయించామన్నారు. ఆ విగ్రహాలను ఇక్కడికి తీసుకువచ్చామని, త్వరలోనే ప్రతిష్టిస్తామని చెప్పారు. విగ్రహాల ఏర్పాటుకు కృషి చేసిన మంగతాయారును పలువురు అభినందించారు.

## జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన శ్రీచైతన్య విద్యార్థులు



పి.రుత్విక్ | పి.కైలాష్ భరత్ | లోకేష్

ఉక్కునగరం: జేఈఈ మెయిన్స్‌లో శ్రీ చైతన్య గాజువాక జోన్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని సంస్థల ఏజీఎం పి.శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల విద్యార్థి పి.రిత్విక్ 99.94 పర్సంటైల్ సాధించగా పి.కైలాష్ భరత్ 99.86, ఈ.లోకేష్ 99.85, డి.శరవన్ నాయుడు 99.82, డి.రామ్ నీరజ్ 99.71, ఎల్.భార్గవ్ 99.67, ఎం.సుధీర్ 99.56, ఎస్.మనోభిరామ్ 99.52, జి.జశ్వంత్ బాలాజీ కుమార్ 99.42, ఎస్.సత్యసాయి నరసింహ పవన్ తేజ 99.36, డి.రవితేజ 99.13 పర్సంటైల్ సాధించారని తెలియజేశారు. కళాశాల విద్యార్థుల్లో 11 మంది 99 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించగా, 24 మంది 98 కంటే ఎక్కువగా, 60 మంది 95 కంటే ఎక్కువగా, 126 మంది 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ, ఎగ్జిక్యూటివ్ డీన్లు అభినందించారు.

## 'ఇన్‌స్పైర్ మనక్'లో 200 ప్రాజెక్టుల ఎంపిక

విశాఖ విద్య: ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో 200 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒక్కో విద్యార్థి రూ.10 వేలు ప్రోత్సాహకం అందుకోనున్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను జిల్లాల వారీగా సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నగదు ప్రోత్సాహకం అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**సామాజిక అంశాలే ప్రధానం**

మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఏటా పాఠశాల స్థాయిలో 'ఇన్‌స్పైర్ మనక్' పేరిట విద్యార్థుల్లో సృజనాత్మకతపై పోటీలను నిర్వహిస్తోంది. సామాజిక అంశాలు, సమాజాభివృద్ధికి దోహదపడే వినూత్నమైన ఆలోచనలకు రూపం ఇచ్చేలా ఎలాంటి ప్రాజెక్టులను తయారు చేస్తామనే అంశంపై విద్యార్థులు తమ ఐడియాను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 2023–24 విద్యా సంవత్సరానికి 2,680 మంది పేర్లు నమోదు చేసుకోగా, ఇందులో 200 మంది ఎంపికయ్యారు. విద్యార్థులు తమకు అందిన రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని వినియోగించుకుని, ప్రాజెక్టుకు అవసరమయ్యే సామగ్రిని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించి, భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం దిశగా సైన్సు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థుల పేర్లతో బ్యాంక్ అకౌంట్ తెరవాలని సూచించారు. దీనిపై ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులు మంచి ప్రాజెక్టులు సిద్ధం చేసేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు.

## కనకమహాలక్ష్మి ఆలయంలో అక్షరాభ్యాసాలు నేడు

డాబాగార్డెన్స్: వసంత పంచమిని పురస్కరించుకుని నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో చిన్నారులకు బుధవారం అక్షరాభ్యాసాలు చేయించనున్నట్లు ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనదలిచే చిన్నారుల తల్లిదండ్రులు రూ.200 రుసుం చెల్లించాలని తెలియజేశారు. పూజకు కావల్సిన సామగ్రిని భక్తులే తెచ్చుకోవాలని చెప్పారు. చిన్నారులకు పలక, పెన్ను, పుస్తకాన్ని దేవస్థానమే ఉచితంగా అందజేయనుందని వివరించారు.